

విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యబృందం

చేర్యాల కస్తూర్బాలో వైద్యశిబిరం ఏర్పాటు

- 180 మందికి పరీక్షలు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేర్యాల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): చేర్యాల శివారులోని కస్తూర్బా విద్యాలయంలో ఎట్టకేలకు ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కస్తూర్బాలోని పలువురు విద్యార్థినులు విష జ్వరాల బారిన పడి ఇళ్లకు వెళ్లారు. మరికొందరిని వైద్యపరీక్షల కోసం కాలినడకన ప్రభుత్వ ఆసుపత్రికి పంపిస్తున్న విషయమై మంగళవారం "విషజ్వరాల బారిన విద్యార్థినులు... కాలినడకన ఆసుపత్రికి" శీర్షికన ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన సంబంధిత అధికారులు విద్యాలయంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పాఠశాలలో ఉన్న సుమారు 180 మంది విద్యార్థులకు వైద్యబృందం వైద్యపరీక్షలు నిర్వహించింది. వారిలో సుమారు 20 మంది జ్వరాలు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు వైద్యాధికారి తిరుపతిరెడ్డి నిర్ధారించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు వైద్యబృందం సూచించింది.



తొమ్మిదేళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న

సుష్మకు రూ.3లక్షలు సాయంచేసిన జగ్గారెడ్డి

దాతలు కూడా ఆర్థికంగా ఆదుకోవాలన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

త్వరగా కోలుకునేలా వైద్యులతో మాట్లాడిన జగ్గారెడ్డి


సుష్మ తండ్రి మహేశ్‌కు రూ. 3లక్షలు అందజేస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదేళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన ఓ అమ్మాయికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి చేయూత అందించారు. రూ.3లక్షల ఆర్థిక సహాయం చేసి ఆసరాగా నిలిచారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండకు చెందిన చెవిగాని మహేశ్ కూతురు సుష్మకు ప్రస్తుతం 18 సంవత్సరాలు. ఆమె తొమ్మిదేళ్ల వయసులో తన అమ్మమ్మ ఇంటికి వెళ్లగా పొరపాటున చీమల మందు కలిసిన చపాతీలు తినడంతో తీవ్ర అనారోగ్యానికి గురైంది. గత 9 ఏళ్లుగా ఆమె మంచానికే పరిమితమైంది. ఆర్థిక స్థోమత లేకపోవడంతో సుష్మకు మెరుగైన చికిత్స అందించలేకపోయారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్ మీడియా వ్యక్తుల ద్వారా విషయం తెలుసుకున్న జగ్గారెడ్డి ఆ అమ్మాయి తండ్రిని పిలిపించుకున్నారు. వైద్యచికిత్స కోసం రూ.3లక్షలు అందించడంతోపాటు డాక్టర్ చంద్రశేఖర్‌తో మాట్లాడి ఆమె త్వరగా కోలుకునేలా చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం తరఫున కూడా వైద్య ఖర్చులు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. దాతలు కూడా ముందుకు వచ్చి ఆర్థిక సహాయం చేయాలని పిలుపునిచ్చారు. ఆర్థిక సహాయం చేయాలనుకునేవారు సుష్మ తండ్రి మహేశ్ నంబర్‌ను 9553461480 సంప్రదించాలని సూచించారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.45 లక్షలు

- 46 రోజుల్లో సమకూరిన వైనం

కొమురవెల్లి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయ హుండీలను ముఖమండపంలో ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. దేవదాయశాఖ సిద్దిపేట డివిజన్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మీ, పోలీసుల బందోబస్తు మధ్య ఆలయ అర్చకులు, సిబ్బంది, శివరామకృష్ణ భజన మండలి సభ్యులు లెక్కింపు చేపట్టారు. 46రోజుల్లో స్వామివారి హుండీల ద్వారా రూ.45,79,870 నగదు, 83 విదేశీ నోట్లు, 44 గ్రాముల మిశ్రమ బంగారం, 4.300 కిలోల మిశ్రమ వెండి లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, ధర్మకర్తలు జయప్రకాశ్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, కాయిత మోహన్‌రెడ్డి, అంజిరెడ్డి, చిగిరి కొమురయ్య, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్, ఎస్‌బీఐ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

లంబోధరహో

- గణపయ్య రాక.. సామాన్యుడికి మోత!
- మార్కెట్‌లో వినూత్న వినాయకులు
- రూ.వేలల్లో పలుకుతున్న ప్రతిమలు
- పూజా సామగ్రి కూడా ప్రియం
- నేడు కొలువుదీరనున్న గణనాథులు


వినాయక ప్రతిమలు

లంబోదరుడి రాకతో మార్కెట్లన్నీ సందడిగా మారాయి. మండపాలు, ఇళ్లలో గణపయ్యను కొలువుదీర్చేందుకు ప్రజలు వినాయక ప్రతిమలు, పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. సిద్దిపేట పట్టణంలోని గాంధీ చౌరస్తా, లాల్ కమాన్, సుభాష్ రోడ్డు, డిగ్రీ కాలేజీ రోడ్డు హౌసింగ్ బోర్డుతో పాటు వివిధ ప్రాంతాల్లో ప్రతిమలు, చవితి పండుగకు అవసరమైన పూజా సామగ్రి కొనుగోలుతో జనాలు మార్కెట్లకు పోటెత్తారు. ఈసారి పెరుగుతున్న ధరలు సామాన్యులకు గుదిబండగా మారాయి.

\- సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి)

ఆకాశాన్నంటుతున్న విగ్రహాల ధరలు

మార్కెట్‌లో వివిధ రంగుల్లో, రకరకాల ఆకృతుల్లో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీవోపీ)తో చేసిన విగ్రహాలు, మట్టితో తయారు చేసిన ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి. ఈ ఏడాది విగ్రహాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చిన్న ప్రతిమల ధరలు కూడా వేలల్లో పలుకుతున్నాయి. గతంతో పోలిస్తే విగ్రహాల ధరలు రెట్టింపయ్యాయి. గతంలో రూ. 300నుంచి రూ. 350

మిగతా 8వ పేజీలో


సిద్దిపేట పట్టణంలో కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న మార్కెట్

మట్టి గణపతిని పూజిద్దాం



సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మట్టితో చేసిన గణపతి ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని రక్షించాలని కలెక్టర్ హైమావతి ప్రజలకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మట్టి గణపతి ప్రతిమలను కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం కలెక్టర్ విగ్రహాలను పంపిణీ చేశారు. జిల్లాలో మట్టి గణపతి విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేస్తున్న కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వారితో మాట్లాడుతున్న కలెక్టర్

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే

కఠిన చర్యలు : కలెక్టర్

సిద్దిపేట రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హైమావతి హెచ్చరించారు. మంగళవారం ఆమె నారాయణరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్ బాపురెడ్డి సెలవులో ఉన్నట్లు తెలుసుకుని, డీఎంహెచ్‌వోతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సూపర్‌వైజర్లకు వీడియో కాల్ చేసి ఉదయం 10.30 అయినా ఇంకా విధులకు వెళ్లకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. విధులకు హాజరు కాని వారికి అబ్‌సెంట్ వేసి ఒక రోజు వేతనం కట్ చేయాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు హాస్టళ్లు


టీటీసీ భవన్‌లో బాలుర హాస్టల్

హుస్నాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):నూతనంగా ఏర్పాటైన శాతవాహన యూనివర్సిటీ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు వేరువేరుగా హాస్టళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుత ఇంజనీరింగ్ కళాశాలలో 65 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ప్రస్తుతం కళాశాలకు హాస్టల్ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇందులో చేరడానికి ఆసక్తి చూపడం లేదు. మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టణంలో అన్ని సౌకర్యాలు ఉన్న భవనాలు గుర్తించి బాలురు, బాలికలకు వేరువేరుగా హాస్టళ్ల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు హుస్నాబాద్ మండల పరిషత్ ఆవరణలో ఉన్న టీటీసీ భవనంలో బాలుర హాస్టల్, డిపో ఎదుట ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్‌లో బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. త్వరలో వీటిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

లేఖ ఎవరు రాశారు!
- చర్చనీయాంశంగా గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిపై 'ఆంధ్రజ్యోతి' కథనం 7

పంటకోసం పండగనక..
- యూరియా కోసం రైతుల అవస్థలు 7


తిమ్మాపూర్‌లో రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది

కోలుకోని తిమ్మాపూర్

- గ్రామస్థులను వణికిస్తున్న విషజ్వరాలు

జగదేవ్‌పూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్ గ్రామం విషజ్వరాల కోరల్లో చిక్కుకుంది. పది రోజులుగా విస్తృతంగా ప్రబలుతున్న జ్వరాలు, డెంగ్యూ లక్షణాలతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వీధుల్లో నీరు నిలిచి దోమలు పెరగడంతో ఈ పరిస్థితి తలెత్తిందని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికే మహేష్, ప్రశాంత్ అనే ఇద్దరు డెంగ్యూతో మృతి చెందారు. ప్రస్తుతం గ్రామంలో వంద మందికి పైగా జ్వరంతో బాధపడుతుండగా, 50 మందికి పైగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో చాలామందికి డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రస్తుతం గ్రామంలోని వారికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందిస్తున్నారు.

జిల్లాలో చిరుజల్లులు



- మరో రెండు, మూడు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు

సిద్దిపేట ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం చిరుజల్లులు కురిశాయి. సిద్దిపేటఅర్బన్ మండలంలో 7.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షాలకు చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. మరో రెండు, మూడు రోజులు ఉరుములు, మెరుపులతో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

నర్సాపూర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ మహమ్మారి, సైబర్ క్రైం వల్ల ఎందరి జీవితాలు నాశనం అవుతున్నాయని వాటి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ వాటికి దూరంగా ఉండాలని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు సూచించారు. మంగళవారం నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కాలేజీలో డ్రగ్స్, సైబర్ క్రైంపై పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. డ్రగ్స్ వల్ల యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రలోభాలకు గురై క్షణికానందం కోసం వెళ్తే జీవితాంతం బాధపడాల్సి వస్తుందన్నారు. సైబర్ క్రైంతో పాటు ఆన్‌లైన్ బెట్టింగు యాప్స్‌కు కూడా చాలా మంది యువత బానిసలుగా మారి డబ్బుతో పాటు జీవితాలను నాశనం చేసుకుంటున్న ఘటనలు ఎన్నో జరుగుతున్నాయని అన్నారు. తల్లిదండ్రులు మీపై ఎన్నో ఆశలు పెట్టుకుని లక్షలు వెచ్చించి చదివిస్తున్నారని వారి ఆశలను వమ్ము చేయకుండా ఉన్నతలక్ష్యముతో కష్టపడి చదివి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగం, కాలేజీ యాజమాన్యం పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు



నర్సాపూర్ పీఏసీఎస్ వద్ద సాయంత్రం ఐదుగంటలకు కూడా రైతులు పడిగాపులు

పండగనక పడిగాపులు

యూరియా కోసం జిల్లా వ్యాప్తంగా అన్నదాతలు కష్టాలు పడుతూనే ఉన్నారు. పంటలను కాపాడుకునేందుకు వినాయక చవితి పండగను సైతం లెక్కచేయకుండా మంగళవారం దుకాణాల వద్ద పడిగాపులు పడ్డారు.

నర్సాపూర్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లోని ప్రధాన చౌరస్తా వద్ద రైతులు ఎరువుల కోసం ధర్నా చేస్తుండగా అటువైపు వచ్చిన ఎమ్మెల్యే సునీతారెడ్డి రైతులకు మద్దతు పలికారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడటం.. ఎమ్మెల్యే ఆందోళన విరమణకు ససేమిరా అనడంతో పోలీసులు ఆమెతోపాటు నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి అనంతరం వదిలిపెట్టారు.

● తొగుట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి మంగళవారం యూరియా వస్తుందనే సమాచారంతో ఉదయం నుంచే రైతులు పెద్ద ఎత్తున తొగుటకు చేరుకుని ఆగ్రోస్ దుకాణం వద్ద బారులు తీరారు. ఎంతకీ యూరియా రాకపోవడంతో రాస్తారోకో చేపట్టారు.

● పుల్‌కల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన పుల్కల్‌లో యూరియా బస్తాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఒక్కో బసాకు రూ.266.50కి విక్రయించాల్సి ఉండగా, రూ.310 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా గంట గుళికలు తీసుకుంటేనే యూరియా ఇస్తామంటూ దుకాణ యజమాని షరతు పెడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. గంగోజిపేటలోనూ రైతులు క్యూలో నిల్చున్నారు.

అధికారులను నిలదీత

సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన చౌటకూర్‌లో మంగళవారం వ్యవసాయ శాఖ-ఇఫ్కో అధ్వర్యంలో నానో యూరియా ప్లస్, డీఏపీపై అవగాహన సదస్సు నిర్వహించారు. కాగా, ఖరీఫ్ సీజన్‌లో కాంప్లెక్స్ ఎరువులు సరఫరా చేయకుండా ఈ అవగాహన సదస్సులు ఏంటని జిల్లా వ్యవసాయాభివృద్ధి శాఖ అధికారి శివప్రసాద్, ఇతర అధికారులను రైతులు నిలదీశారు.

● శివ్వంపేట, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి) : శివ్వంపేట పీఏసీఎస్ కార్యాలయం వద్ద సోమవారం రాత్రి 11 గంటల నుంచి సద్ది కట్టుకొని వచ్చి చెప్పులు, ఇటుకలు వరుస సంఖ్యలో పెట్టి నిరీక్షిరచారు. ఉదయం సిబ్బంది వచ్చి యూరియా రాదని చెప్పడంతో రైతులు ధర్నాకు దిగారు.

● కంది, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : కంది పీఏసీఎస్‌కు అన్నదాతలు పోటెత్తారు. 350 బస్తాలు మాత్రమే దిగుమతి కావడంతో ముందుగా వచ్చిన రైతులకు ఒకొక్కరికి 2 బస్తాల చొప్పున అందజేశారు. దొరకనివారు నిరాశతో వెనుదిరిగారు.

● జిన్నారం, అగస్టు 26, (ఆంధ్రజ్యోతి): జిన్నారంలోని రెండు ఫర్టిలైజర్ షాపులకు సమీప గ్రామాల రైతులు ఒక్కసారిగా వెళాటంతో కొద్ది సేపు గందరగోళం నెలకొన్నది.

● మద్దూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలంలోని లద్నూరు క్లస్టర్‌లోని లద్నూరు, మర్మాముల, సలాఖ్‌పూర్, ధర్మారం గ్రామాల రైతులకు పోలీసుల పహారాలో రైతులకు యూరియా టోకెన్లు అందించారు. నాలుగు గ్రామాల రైతులకు రైతు వేదికలో ఒకే చోట కూపన్లు అందించడంతో రైతుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది.

● హుస్నాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ రైతు వేదిక వద్ద యూరియా టోకెన్ల కోసం రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



తొగుటలో రాస్తారోకో చేస్తున్న రైతులను సముదాయిస్తున్న పోలీసులు



చౌటకూర్‌లో వ్యవసాయ అధికారులను నిలదీస్తున్న రైతులు



జిన్నారంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణం వద్ద బారులు తీరిన రైతులు



నర్సాపూర్‌లో ఎరువుల కోసం ధర్నా చేస్తున్న రైతులకు మద్దతుగా పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



పుల్కల్‌లో యూరియా కోసం ఎగబడిన రైతులు



చౌటకూర్‌లో యూరియా కోసం బారులు తీరిన రైతులు



శివ్వంపేటలో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు



యూరియా టోకెన్ల కోసం హుస్నాబాద్ రైతు వేదికలో రైతుల రద్దీ

బొౖర్ర పేరుమాండ్లే బొజ్జ గణపయ్య

- 400 ఏళ్ల నాటి చరిత్ర కలిగిన ఆలయం
- కుడివైపు తొండం, దక్షిణాభిముఖంగా ఆలయద్వారం
- దండం పెట్టి కొబ్బరికాయ కొడితే కొంగు బంగారం
- 11 ప్రదక్షిణలు చేస్తే వరాలనొసగే వినాయకుడు

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలోని బొౖర్రపేరుమాండ్ల వీధిలోని బొౖర్రపేరుమాండ్ల ఆలయానికి సుమారుగా 4వందల ఏళ్ల చారిత్రక నేపథ్యం ఉంది. 12వ శతాబ్దంలో ఈ ఆలయం నిర్మించారని, కాకతీయుల కాలం నాటిదని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. కానీ ఇందుకు సంబంధించిన స్పష్టమైన ఆధారాలు లేవు. ఇక మరికొంత మంది స్థానికులు అనుకుంటున్న దాని ప్రకారం సిద్దిపేట పట్టణం ఏర్పడకముందే ఇక్కడ మాతంగి అనే నది ప్రవహించేదని, ఆ నది ఒడ్డున నల్లరాతితో చేసిన గణపతి విగ్రహంతో పాటుగా మరికొన్ని విగ్రహాలు లభ్యమయ్యాయని స్థానికులు చెబుతున్నారు. అలా దొరికిన విగ్రహాలను ఒకచోట చేర్చి ఆలయం నిర్మించారని అంటున్నారు. అప్పటి నుంచి బొౖర్ర పేరుమాండ్ల దేవాలయంగా పిలుస్తారని, పేరుమాండ్లు అనేది తమిళనాడులో ఎక్కువగా వాడుకలో ఉంటుందని భక్తి, మర్యాదపూర్వకంగా పేరుమాండ్లు అని సంబోధిస్తారని చెబుతున్నారు. సాధరణంగా వినాయక విగ్రహాలకు తొండం ఎడమ వైపు ఉంటుంది. కానీ ఇక్కడ కుడివైపు ఉంటుంది. తొండంకు ప్రత్యేకంగా వెండితో తొడుగు చేయించారు. తొండం కుడివైపు ఉండటం వల్ల విశేషమైన ఆకర్షణ ఉంటుందని దేవాలయ అర్చకులు చెబుతున్నారు. 11 ప్రదక్షిణలు చేసి ఒక కొబ్బరికాయ కొట్టి స్వామికి దండం పెడితే కోరిన కోరికలు తీరుతాయని ఈ ఆలయానికి వచ్చే భక్తుల నమ్మకం. ఈ మొక్కును కొబ్బరికాయ దండం అని పిలుస్తారు. ఈ ఆలయంలో గణపతితో పాటుగా అంబిక అమ్మవారు, సుబ్రమణ్య స్వామి, సూర్యభగవానుడు, నంది, ఆంజనేయ స్వామి కొలువై భక్తులను అనుగ్రహిస్తున్నారు. పూర్వకాలం నుంచి కాలక్రమేణ కొందరు ముందుకొచ్చి ఆలయాన్ని అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నారు. ఆ వారసత్వాన్ని, సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ప్రస్తుతం కూడా బొౖర్ర పేరుమాండ్ల దేవాలయ కమిటీగా ఏర్పడి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రస్తుతం వినాయక నవరాత్రులు, ఆలయ 53వ వార్షికోత్సవం సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 9 రోజులపాటు గణపతి హోమం నిర్వహించనున్నారు. ఇవేకాకుండా ప్రతిరోజు స్వామివారికి దూపదీప నైవేద్యం, మంగళ, శనివారాల్లో 25 కిలోల వరకు ప్రసాద వితరణ ఉంటుంది. నెలకోసారి వచ్చే సంకష్టహర చతుర్థికి గణపతి హోమం, అన్న ప్రసాద వితరణ ఏర్పాటుచేస్తారు.



స్వామివారి మూలవిరాట్

ఆరడుగుల ఏకశిలా వృద్ధి వినాయకుడు

రేగోడు ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): రేగోడు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం రేగోడులోని ప్రసిద్ధ వినాయకుని ఆలయం ఉత్సవాలకు సిద్ధమైంది. ఇక్కడ ఉన్న ఆరడుగుల ఏకశిలా వినాయకుడు దాదాపు 500 ఏళ్ల నాటిదని గ్రామస్థుల నమ్మకం. ఈ ఆలయంలోని వినాయకుడి విగ్రహం ప్రతి ఏటా కొంత పెరుగుతోందని అందుకే 'వృద్ధి వినాయకుడిగా' పిలుస్తారని గ్రామస్థులు చెబుతుంటారు. ఆలయం పక్కనే సంస్కృతంలో చెక్కిన శిలాఫలకం కూడా ఉంది. వినాయక చవితి సందర్భంగా తొమ్మిది రోజుల పాటు ఆలయం వద్ద నిత్య దానం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



బాడీబిల్డింగ్ పోటీల్లో సాయికుమార్‌కు తృతీయస్థానం

పటాన్‌చెరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు పట్టణానికి చెందిన బాడీబిల్డర్ సాయికుమార్ జాతీయ స్థాయి పోటీల్లో తృతీయ స్థానం సాధించారు. ఆదివారం శంషాబాద్‌లో జరిగిన ఐసీఎన్ ఇండియా నేచురల్ బాడీబిల్డింగ్ పోటీల్లో దేశవ్యాప్తంగా వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్‌లో 30 మందితో పోటీపడ్డ సాయికుమార్, మూడో స్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు ప్రకటించారు. బీరంగూడలో 90 రోజుల పాటు శిక్షణ తీసుకున్నట్లు ఆయన కోచ్ భాస్కర్ తెలిపారు.



సాయికుమార్

కేంద్ర నిర్లక్ష్యంతోనే యూరియా కొరత

- రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్




తాగునీటిశుద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

గజ్వేల్/జగదేవ్‌పూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా సంక్షేమ ప్రభుత్వం నడుస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్ అన్నారు. గజ్వేల్ మండలం రిమ్మనగూడ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి చారిత్రాత్మక నిర్ణయాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం జోడెద్దులుగా నడిపిస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో యూరియా సమస్య తలెత్తిందని, ఆ నెపాన్ని కాంగ్రెస్ ప్రభుత్వంపై నెట్టేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తుందని విమర్శించారు. అలాగే మంగళవారం ఆయన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బీర్ల ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన మంచినీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపోచమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆయా కార్యక్రమాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాగనోళ్ల విజయమోహన్, వైస్ చైర్మన్లు సర్దార్‌ఖాన్, ప్రభాకర్‌గుప్తా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు నిమ్మ రంగారెడ్డి, రవిందర్‌గుప్తా, గన్నెపల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'పందిల్ల' వంతెన పైనుంచి రాకపోకలు షురూ

- దశాబ్దాల సమస్యకు పరిష్కారం



హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కల నెరవేరింది. పందిల్ల వాగుపై నిర్మించిన హై లెవల్ వంతెనతో ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోయాయి. వానాకాలం వస్తే భారీ వర్షాలతో పందిల్ల వాగులోని లో లెవల్ వంతెనపై వరద ప్రవాహం ప్రవహించి రాకపోకలు నిలిచిపోయేవి. దీంతో హన్మకొండ-సిద్దిపేట మధ్య ప్రయాణం కష్టంగా ఉండేది. అయితే జాతీయ రహదారి (765 డిజి) నిర్మాణంలో భాగంగా పందిల్ల వాగుపై హై లెవల్ వంతెనను నిర్మించారు. ఆరు పిల్లర్లతో నిర్మించిన ఈ వంతెన పనులు పూర్తి కావడంతో శుక్రవారం సాయంత్రం నుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి. దీంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

లేఖ ఎవరు రాశారు..!

- చర్చనీయాంశంగా గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిపై ఆంధ్రజ్యోతి కథనం

గజ్వేల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ప్రభుత్వాసుపత్రితో పాటు పట్టణవ్యాప్తంగా ఆంధ్రజ్యోతి కథనం చర్చనీయాంశంగా మారింది. గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో లోటుపాట్లపై ఆసుపత్రి సిబ్బంది, బాధితులు మంత్రికి లేఖ రాశారు. ఈ లేఖ 'ఆంధ్రజ్యోతి'కి చిక్కడంతో లేఖలోని అంశాలను బహిర్గతం చేస్తూ కథనాన్ని ప్రచురించగా, తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో లేఖ ఎవరు రాశారు.. వారికి జరిగిన నష్టం ఏమిటి...? ఎందుకు రాశారు.. తమతో ఇబ్బంది పడిన వారు.. ఎవరనే విషయంపై అధికారులు, సిబ్బంది ఒకరికొకరు చర్చించుకుంటూ ఆరా తీశారు. ఈ క్రమంలోనే పలువురు బాధితులు ప్రభుత్వాసుపత్రిలో ప్రైవేటు ల్యాబ్‌ల నిర్వాహకులు, మెడికల్ దుకాణాల నిర్వాహకుల దందా, ఇతరత్రా సమస్యల గురించి 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్ ద్వారా తెలియజేశారు. పెద్ద ఎత్తున సిబ్బంది దందాకు పాల్పడుతున్నారని, వారికి సంబంధించిన ఆధారాలు ఇస్తామని తెలిపారు.

పారదర్శకంగా సేవలను అందిస్తున్నాం..

ప్రజలకు పారదర్శకంగా సేవలను అందిస్తున్నామని, గిట్టని వాళ్లే తమపై ఆరోపణలు చేస్తున్నారని గజ్వేల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. ఆంధ్రజ్యోతి కథనం విషయమై మంగళవారం ఆమె మాట్లాడుతూ.. కొంతమంది చిల్లర వ్యక్తులు కావాలనే పని కట్టుకుని తమపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఎంతో చిత్తశుద్ధితో ప్రజలకు సేవలను అందిస్తున్నామని, ఎక్కడా లాభాపేక్ష లేకుండా, నిష్పక్షపాతంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. గజ్వేల్ పట్టణంలోని జిల్లా ఆసుపత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు నాణ్యమైన సేవలను అందిస్తున్నామని, ప్రజలు అపోహాలు , వదంతులు నమ్మవద్దని తెలిపారు.

పారిశ్రామిక భద్రతలో వ్యవస్థాగత సంస్కరణలు జరగాలి



కార్యక్రమంలో పాల్గొన్న బాధిత కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పాశమైలారం సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటనకు ప్రతి స్పందనగా పారిశ్రామిక భద్రతలో తక్షణ, వ్యవస్థాగత సంస్కరణలు జరగాలని పౌర సమాజ సంస్థలు డిమాండ్ చేశాయి. ఉప్పల్‌లోని మాంట్‌ఫోర్ట్ సోషల్ ఇన్‌స్టిట్యూట్‌లో సైంటిస్ట్ ఫర్ పీపుల్, హ్యూమన్ రైట్స్ ఫోరం, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ, వర్కింగ్ పీపుల్సకోయలిషన్ సంయుక్తంగా నిర్వహించిన వర్క్‌షాప్‌లో బాధితుల కుటుంబాలు తమ ఆవేదనను వెలిబుచ్చాయి. ఈ సందర్భగా బ్రదర్ వర్గీస్ థెక్కనాథ్, శాస్త్రవేత్త డాక్టర్ బాబూరావు, న్యాయవాది అఖిల్‌సూర్య మాట్లాడుతూ యాజమాన్యాలు కార్మికులను రక్షించడం కంటే పారిశ్రామిక వృద్ధికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాయని విమర్శించారు. పాత చట్టాలు న్యాయం చేయలేవని, పరిహారం చెల్లింపులు బాధ్యత నుంచి తప్పించుకోవడానికి ఉపయోగించకూడదని సూచించారు. కొత్త లేబర్ కోడ్‌లు రాష్ట్ర అధికారాలను తగ్గించాయన్నారు. చట్టాల అమలు, పారదర్శక నివేదికలు, బాధిత కుటుంబాలకు దీర్ఘకాలిక మద్దతు అవసరమన్నారు. కార్యక్రమంలో సాగర్, ధార, రవి కన్నెగంటి, పీజీ రావు, సాత్విక గుప్తా, డా. ప్రకాష్ లూయిా, ట్రేడ్, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

వచ్చేనెల 13న జాతీయ లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీ చంద్ర

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : వచ్చేనెల 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. భవానీ చంద్ర కోరారు. జిల్లా కోర్టులో మంగళవారం జిల్లాలోని బ్యాంకు, ఇన్సురెన్స్, చిట్‌ఫండ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో మోటార్ వాహన ప్రమాద కేసులు, బ్యాంకు మొండి బకాయిలు, చిట్‌ఫండ్ తదితర రాజీ పడే అన్ని కేసులను త్వరితగతిన పరిష్కరించనున్నట్లు చెప్పారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే బ్యాంకు, ఇన్సురెన్స్, చిట్ ఫండ్‌ల అధికారులు ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీ చంద్ర

న్యూస్ బాక్స్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: డీఎంహెచ్‌వో

గజ్వేల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో సీహెచ్ ధన్‌రాజ్ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరిండెంట్ అన్నపూర్ణతో కలసి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి, వారి క్షేమసమాచారాలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాదులు ప్రబల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి, మంచి ఆరోగ్య అలవాట్లు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను గూర్చి వారికి పలు సలహాలు, సూచనలు చేశారు. వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, సీహెచ్‌వో రవీందర్, ఎపిడెమోలిస్ట్ సోఫాన్ తదితరులున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

● జడ్పీ సీఈవో రమేష్

సిద్దిపేట రూరల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని జడ్పీ సీఈవో రమేష్ గ్రామస్థులకు సూచించారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో డ్రై డే పనులతో పాటు, ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో పురోగతిని పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పనుల్లో జాప్యం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మురళీధర్ శర్మ, పంచాయతీ కార్యదర్శి గౌస్ పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడిని నిరసిస్తూ బార్ అసోసియేషన్ నిరసన

హుస్నాబాద్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి న్యాయవాది తన్నీరు శ్రీకాంత్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం హుస్నాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు సాయిని మల్లేశం, కన్నోజు రామ కృష్ణ బోయిని సురేష్, దీకొండ ప్రవీణ్ తదితరులున్నారు.

క్విజ్‌పోటీలలో ఆకునూరు విద్యార్థుల ప్రతిభ

చేర్యాల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ హైదరాబాదు బ్రాంచి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ క్విజ్ పోటీల్లో మండలంలోని ఆకునూరు జడ్పీఎస్ఎస్‌కు చెందిన పోచబోయిన వైష్ణవి, పి.రమ్య, ప్రతిభ కనబరిచి రూ.7వేలు. రూ.5వేలు చొప్పున నగదు బహుమతి కైవసం చేసుకున్నారు. ఈ మేరకు మెంటార్‌గా వ్యవహరించిన ఫిజికల్ సైన్స్ టీచర్ ఆర్.రవీందర్‌తో పాటు విద్యార్థులను ఉపాధ్యాయులు, ఏపీఎస్ కమిటీ ప్రతినిధులు అభినందించారు.

బాధ్యతతో విధులు నిర్వర్తించాలి

మద్దూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : పోలీసు స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా ప్రవర్తించడంతో పాటు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని హుస్నాబాద్ ఏసీపీ సదానందం సూచించారు. మంగళవారం మద్దూరు పోలీసు స్టేషన్‌ను చేర్యాల సీఐ శ్రీనుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులతో పాటు పోలీసు సిబ్బంది కిట్ ఆర్టికల్స్, స్టేషన్ పరిసరాలు, సిబ్బంది గృహాలు, అబాండెండ్ వెహికిల్స్ పరిశీలించారు. విధుల పట్ల సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు.

విద్యుత్‌షాక్‌తో గొర్రె మృత్యువాత

చేర్యాల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్త్యాల గ్రామశివారులో ప్రమాదవ శాత్తు విద్యుత్‌షాక్‌కు గురై గొర్రె మృత్యువాత పడింది. గ్రామానికి చెందిన సింహ పోచయ్య గొర్లు, మేకలను శివారులోని ఖాళీ ప్రదేశాలకు తీసుకువెళ్తుండగా, రోడ్డుపక్కన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ వద్ద గొర్రె విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది.

రేషన్ డీలర్లకు కమీషన్‌ను ఇవ్వాలి

కోహెడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లకు రావాల్సిన 5 నెలల కమీషన్ ప్రభుత్వం వెంటనే అందించాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ దేవేంద్రకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ఉత్తర్వుల కనుగుణంగా డీలర్లకు ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు సంబందించిన కమిషన్ రావల్సి ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డీలర్లకు ఇచ్చే కమిషన్ వేర్వేరుగా కాకుండా పాత పద్ధతి ప్రకారం అందించాలని డిమాండ్ చేశారు.



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న దృశ్యం



హుస్నాబాద్ డిగ్రీ కళాశాలలో పూజలో వాడే మొక్కల ఔషధ గుణాలను వివరిస్తున్న అధ్యాపకులు



దుబ్బాక: లచ్చపేట ఆదర్శపాఠశాలలో మట్టివినాయక ప్రతిమలను తయారు చేసిన విద్యార్థులు

మట్టి గణపతి.. పర్యావరణ హితం



సిద్దిపేట పట్టణంలోని క్రాంతి హైస్కూల్‌లో మట్టి ప్రతిమలను తయారు చేస్తున్న విద్యార్థులు



గజ్వేల్ మండలం కొడకండ్ల పాఠశాలలో విద్యార్థులతో కలిసి మట్టి ప్రతిమలను తయారు చేస్తున్న ఉపాధ్యాయినులు



కొమురవెల్లి మల్లన్న సన్నిధిలో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న ఆలయకార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ,అర్చకులు

న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పర్యావరణహిత మట్టి గణపతి ప్రతిమల తయారీపై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. పలు చోట్ల ఎలాంటి రసాయనాలు వాడకుండా సృజనాత్మకంగా ప్రతిమల తయారీపై పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచినవారికి బహుమతులను అందజేశారు. బంకమట్టి, పిండి, నవధాన్యాలతో ప్రతిమలను పర్యావరణ హితంగా ఎలా చేయవచ్చో విద్యార్థులకు వివరించారు. పలుచోట్ల విద్యార్థులతో మట్టి ప్రతిమలను తయారు చేయించి ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. పలు పాఠశాలల్లో ముందస్తు వినాయక చవితి పండుగను నిర్వహించి విద్యార్థులకు సంప్రదాయ పండుగల ప్రాశస్త్యాన్ని వివరించారు. మరికొన్ని చోట్ల వినాయక చవితి పూజలో వాడే 21 రకాల ఔషధ మొక్కల ప్రాముఖ్యతను, వాటి ఔషధ గుణాలపై విద్యార్థులకు వర్క్‌షాపు నిర్వహించారు. అదేవిధంగా జిల్లాలో హిందూ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ట్రస్టులు, వివిధ పార్టీల ఆధ్వర్యంలో మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మట్టి గణపతిని పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలియజెప్పారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



తిమ్మాపూర్ గ్రామస్థులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్

జగదేవ్‌పూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు, వైరల్ ఫీవర్ వ్యాపిస్తున్నందున వైద్య, శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామాన్ని ఆమె సందర్శించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఇటీవల డెంగీతో మృతి చెందిన నాయిని శ్రావణ్, కొంతం మహేష్‌ల వైద్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎంత మంది జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారని స్థానిక వైద్యాధికారికి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ప్లాస్టిక్ కవర్లు అమ్మితే చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. గ్రామంలో పారిశుధ్యం లోపించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎంపీడీవో, కార్యదర్శి, శానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు గ్రామంలోని పలువురి ఇళ్ల లోపలికి వెళ్లి నిల్వఉన్న మురికి నీటిని పారబోయించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిని దేవకీ దేవి, జిల్లా వైద్యాధికారి ధనరాజ్, ఎంపీడీవో రాంరెడ్డి, అధికారులు వైద్యాధికారులు ఉన్నారు.

కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ.. ఎస్‌వోకు షోకాజ్

జగదేవ్‌పూర్ మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాలను అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో 11 మంది ఉపాధ్యాయులకు గానూ 8 మంది సెలవులో ఉండగా ముగ్గురు మాత్రమే పాఠశాలలో ఉండడంతో అడిషనల్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే డీఈవో శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్‌లో మాట్లాడి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఈవో పనితీరుపై కూడా అసహనం వ్యక్తం చేశారు. జిల్లా అధికారిగా అన్ని చూసుకోవాల్సిన బాధ్యత మీపై లేదా అని ప్రశ్నించారు. ఉదయం అల్పాహారం ఇడ్లీ సకాలంలో పెట్టలేదని, మధ్యాహ్నం భోజనం కూడా సమయానికి వండలేదని, మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని విద్యార్థులు అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలలో ఏ ఒక్కటి సరిగా లేదని ప్రత్యేక అధికారి స్రవంతికి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. ఒకేసారి ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వవద్దని హెచ్చరించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



కొండపాక/సిద్దిపేట రూరల్/హుస్నాబాద్‌రూరల్ , ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తొగుట సీఐ లతీఫ్ విద్యార్థులకు సూచించారు. కొండపాక మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. మహిళలు గృహహింస, వేధింపులకు గురైతే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. అదేవిధంగా సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌లో కేజీబీవీ విద్యాలయంలో సిద్దిపేట రూరల్ ఎస్ఐ రాజేష్ విద్యార్థినులకు సైబర్‌నేరాలు, ఆన్‌లైన్‌మోసాలు, మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డలో పోలీస్‌ల ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. షీటీం బృందం ఏఎస్ఐ సదయ్య మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల మహిళలు మహిళల రక్షణ చట్టాలపై అవగాహన పెంపొందించు కోవాలన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి: ఏసీపీ

చేర్యాల/మిరుదొడ్డి, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): పరస్పరం గౌరవించుకుంటూ ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని హుస్నాబాద్ ఏసీపీ సదానందం పేర్కొన్నారు. చేర్యాల పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగలు జరుపుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో చేర్యాల సీఐ ఎల్.శ్రీను, ఎస్ఐ నవీన్, వీహెచ్‌పీ, బీజేపీ, భజరంగ్‌దళ్, ముస్లిం కులసంఘం, మసీద్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.మిరుదొడ్డి మండలంలోని ఆయా గ్రామాల్లో వివిధ యువజన సంఘాలు, యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు పోలీసుల అనుమతిని కచ్చితంగా తీసుకోవాలని ఎస్ఐ సమతా తెలిపారు. మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.

ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలి



నారాయణరావుపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



గజ్వేల్‌లో తహసీల్దార్ శ్రావణ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ మండల నాయకులు



హుస్నాబాద్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సిద్దిపేట రూరల్/గజ్వేల్/ హుస్నాబాద్ టౌన్/చిన్నకోడూరు/వర్గల్/చేర్యాల, ఆగస్టు 26(ఆంధ్ర జ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం జిల్లావ్యాప్తంగా ఆయా మండలాల్లోని రెవెన్యూ అధికారులకు బీజేపీ ఆధ్వర్యంలో వినతిపత్రాలను సమర్పించారు. అనంతరం ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. అడ్డగోలు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం పాలనతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైనవారికి ఆరు గ్యారెంటీలతో పాటు ఇందిరమ్మ ఇళ్లను, పెన్షన్ వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయా మండలాల్లోని తహసీల్ కార్యాలయాల్లో బీజేపీ మండలాధ్యక్షుల ఆధ్వర్యంలో తహసీల్దార్లకు వినతిపత్రాలను అందజేశారు.

శత్రు దేశాల నుంచి యూరియా దిగుమతి చేసుకోవడం సరికాదు

● నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఆగస్టు 26(ఆంధ్రజ్యోతి): మేకిన్ ఇండియా అంటే శత్రు దేశాల నుంచి యూరియా దిగుమతి చేసుకోవడమా అని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి ప్రశ్నించారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... బీజేపీ 12 ఏళ్లుగా మేకిన్ ఇండియా అంటూ.. ఊదరగొడుతూ చేసిందేమీ లేదన్నారు. ఇప్పటికి యూరియాను శత్రుదేశాల నుంచి యూరియాను దిగుమతి చేసుకోవడం సరికాదన్నారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ప్రజలకు అందుబాటులో ఉండరని, ఆయనకు ప్రజల కష్టాలు తెలియవన్నారు. ఎంపీకి చిత్తశుద్ది ఉంటే మోదీతో మాట్లాడి రైతులకు యూరియాను అందించాలన్నారు.

సురవరం మృతిపై సీపీఐ సంతాపం

కోహెడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మృతికి మండల సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో కో సంతాపం తెలిపారు. ఈ మేరకు మంగళవారం కోహెడలో సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థి దశ నుంచి ఆయన కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలతో ప్రజల పక్షాన జీవితాంతం పనిచేసి అనేక పోరాటాలు నిర్వహించారని కొనియాడారు. కమ్యూనిస్టుల ఐక్యత కోసం కృషి చేశారన్నారు. కార్యక్రమలో సీపీఐ మండల కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్, సీపీఐ నాయకులు బోనగిరి శంకర్ కొమ్ముల రామచంద్రారెడ్డి, గ్రరైపల్లి రవీందర్, కొత్తపల్లి రాజయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చిట్యాల శేఖర్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కందుకూరి అంతయ్య, అలవాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పొజిషన్ సర్టిఫికెట్లు అందించాలి

కోహెడ, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాముల పల్లి గ్రామంలో సర్వేనెంబర్ 126, 129 లో హద్దులు చూపించి నిరుపేదలకు పొజిషన్ సర్టిఫికెట్లు అందించాలని మండల సీపీఐ కార్యదర్శి వేల్పుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం ఈ సర్వే నంబర్లలో గతంలో సర్టిఫికెట్లు ఇచ్చిన నిరుపేదలతో కలిసి సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో గుడిసెలు వేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నాటి సీపీఐ పార్టీ నాయకుడు, మాజీఎమ్మెల్యే దేశిని చిన్న మల్లయ్య ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు ఇప్పించినట్టు తెలిపారు. జాప్యం వల్ల నిరుపేదలు ఇళ్ల నిర్మాణం చేపట్టలేదన్నారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఈ పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు. దీనిపై హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తికి కూడా విన్నవించడంతో సానుకూలంగా స్పందించి నాటి పేదలకు పర్మిషన్ ఇవ్వాల్సిందిగా తహసీల్దార్‌కు ఆదేశించినట్టు తెలిపారు. అయితే నెలరోజులు గడిచినా సర్వే చేయించకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. దీంతో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఎర్రజెండా నీడ కింద గుడిసెలు వేయించామన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు బోనగిరి శంకర్, జాగిరి బాలయ్య, గ్రరైపల్లి రవీందర్, రామచంద్రారెడ్డి ఉన్నారు.

మండల మహిళా సమాఖ్య వార్షికోత్సవ సమావేశం

వర్గల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వర్గల్ మండల మహిళా సమాఖ్య 21వ వార్షికోత్సవ మహాసభ సమావేశం మంగళవారం ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం కిరణ్‌కుమార్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో బ్యాంకు లింకేజీ 100 శాతం సాధించిన సీసీ, వీవోఏలను ఘనంగా సన్మానించి వార్షికోత్సవ జ్ఞాపికను అందజేశారు. అనంతరం గ్రామాల అధ్యక్షులకు, వీవోఏలకు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లకు వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకుని విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రేణుక, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు నర్సింలు, సత్యనారయణ, పద్మలత, సుభాష్‌గౌడ్, రమేశ్, సాయిలు, భాస్కర్, అకౌంటెంట్ లత పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం సంఘటిత ఉద్యమం

● తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలని, ముదిరాజ్‌లకు జనాభా ప్రాతిపదికన ఇవ్వాల్సిన వాటాను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సంఘటిత ఉద్యమం చేపట్టనున్నట్లు తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుంకరబోయిన మహేష్ పేర్కొన్నారు. మంగళవారం టీఎంపీఎస్ రాష్ట్ర కార్యదర్శి జనవేని శ్రీనివాస్ అధ్యక్షతన హుస్నాబాద్ పట్టణంలో పల్లెబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్‌పార్టీ హామీ ఇచ్చిన మేరకు బీసీ 'డి' నుంచి బీసీ 'ఏ' లోకి మార్చాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లకు చేపపిల్లలను ఉచితంగా పంపిణీ చేయాలని, 57 సంవత్సరాలు నిండిన ముదిరాజ్‌లకు రూ. 5000 పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంజిత్ ముదిరాజ్, కాశబోయిన శేఖర్, పెసరు కుమారస్వామి, అట్టెం రమేష్, కరుణాకర్, నాయకులు ఉన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి బలవన్మరణం





మల్లయ్య, ఎర్ర రామవ్వ మృతదేహాలు

జగదేవ్‌పూర్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి):జగదేవ్‌పూర్ మండలంలో మంగళవారం చోటు చేసుకున్న వేర్వేరు ఘటనల్లో ఇద్దరు బలవన్మరణం చెందారు పీర్లపల్లిలో ఓ వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా, మండలకేంద్రంలో వృద్ధురాలు ఉరేసుకుని బలవన్మరణం చెందింది. జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి వివరాల ప్రకారం.. మండలంలోని పీర్లపల్లి గ్రామానికి చెందిన మాడబోయిన మల్లయ్య(80) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతడి మంచి చెడులు తమ్ముడి కుమారుడు చూసుకునేవాడు. జగదేవ్‌పూర్‌లో తిరుగుతూ సాయంత్రానికి ఇంటికి వెళ్లేవాడు. సోమవారం రాత్రి మల్లయ్య ఇంటికి వెళ్లలేదు. మంగళవారం ఉదయం జగదేవ్‌పూర్ మార్కెట్ షెడ్‌లో పురుగుల మందు తాగి మల్లయ్య మృతి చెందాడు. ఈ సమాచారమందుకున్న పోలీసులు మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మల్లయ్య తమ్ముడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మండలకేంద్రంలో జరిగిన మరో ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగదేవ్‌పూర్‌కు చెందిన ఎర్ర రామవ్వ(60) భర్త నాలుగేళ్ల క్రితమే మరణించాడు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. భర్త మృతి చెందిన ప్పటి నుంచి రామవ్వ కడుపు నొప్పి, ఫిట్స్ వ్యాధితో బాధపడుతూ ఒంటరిగానే జీవిస్తున్నది. సోమవారం రాత్రి రామవ్వ గదిలోకి వెళ్లింది. మంగళవారం ఉదయం గది తలుపులు తీయడానికి కుమారుడు సత్యనారాయణ యత్నించగా లోపలి నుంచి గడియ వేసి ఉంది. గది తలుపులు పగులగొట్టి చూడగా రామవ్వ ఉరేసుకుని దూలానికి వేలాడుతూ కనిపించింది. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

సిద్దిపేట కొత్త బస్టాండ్‌లో వ్యక్తి మృతదేహం



మృతి చెందిన వ్యక్తి

సిద్దిపేట క్రైం, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలో కొత్త బస్టాండ్‌లో 7వ నంబర్ ప్లాట్ ఫామ్ వద్ద ఒక గుర్తు తెలియని వృద్ధుడి(65) లభ్యమైంది. వన్ టౌన్ సీఐ వాసుదేవ వివరాల ప్రకారం.. ప్రకారం.. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. అతడు తెలుపు నీలిరంగు నిలువుగీతలు కలిగిన ఫుల్ షర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడిపై ఆకుపచ్చ రంగు దుప్పటి ఉంది. మృతుడు సామ నలుపు కలిగి, తెలుపు రంగు జుట్టు కలిగి ఉన్నాడు. కుడి చేతికి ఎరుపు రంగు దారాలు ఉన్నట్లు తెలిపారు. గత రెండు రోజులుగా బస్టాండ్ చుట్టూ తిరుగుతూ రాత్రి సమయంలో బస్టాండ్‌లో ఉన్నట్టు తెలిపారు. సోమవారం రాత్రి కొత్త బస్టాండ్ ప్లాట్‌ఫామ్ వద్ద పడుకొని మృతి చెందినట్టు తెలిపారు. ఎవరికైనా తెలిస్తే.. సిద్దిపేట వన్ టౌన్ పోలీసులకు ఫోన్ నెం 8712667311, 8712667450కి సమాచారం ఇవ్వాలని కోరారు.

ధర్మారంలో జీపీ ట్యాంకర్ టైర్ల చోరీ

మద్దూరు, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధర్మారం గ్రామంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ట్యాంకర్ రెండు టైర్లను ఎత్తుకెళ్లారు. పంచాయతీ సెక్రటరీ బి. అశోక్ మాట్లాడుతూ.. సోమవారం గ్రామంలో నర్సరీ వద్ద జీపీ ట్యాంకర్ నిలిపినట్లు తెలిపారు. మంగళవారం సిబ్బంది వెళ్లి చూడగా ట్యాంకర్ రెండు టైర్లు చోరీకి గురైనట్లు చెప్పడంతో తాను ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించినట్టు తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లగా ఎస్ఐ నిరాకరించినట్లు సెక్రటరీ తెలిపారు.

మిషన్ భగీరథ పంపుహౌజ్ ఎదుట ఆందోళన



మహ్మదాపూర్ మిషన్ భగీరథ పంపుహౌజ్ ముందు ఆందోళన వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబాల సభ్యులు

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): మహ్మదాపూర్‌లోని మిషన్ భగీరథ పంపుహౌజ్‌లో జరిగిన ప్రమాద సంఘటనలో బాధితులకు వైద్య ఖర్చులు చెల్లించడం లేదని మంగళవారం పంపుహౌజ్ ముందు బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఇటీవల పంపుహౌజ్‌లో ప్యానల్ బోర్డులు మరమ్మతు చేస్తుండగా ముగ్గురు ఆపరేటర్లు ప్రమాదానికి గురయ్యారు. అందులో శ్రీకాంత్‌కు 70 శాతం చేతులు కాలి ఆసుపత్రిలో విషమ పరిస్థితిలో చికిత్స పొందుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలకు న్యాయం చేయాలని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ఆసుపత్రి బిల్లులు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో బాధితులను వారి కుటుంబీకులు ఆసుపత్రిలో వైద్యం చేయిస్తున్నారు. అయితే దాదాపు 5 రోజులు గడిచినా ఇంత వరకు ఆసుపత్రిలో డబ్బులు చెల్లించ లేదని ఆసుపత్రి వైద్యులు డబ్బులు చెల్లిస్తేనే వైద్యం అందిస్తామని పేర్కొనడంతో అధికారులకు ఫోన్ చేశారు. అధికారులు స్పందించక పోవడంతో పంపుహౌజ్ మోటర్లు బంద్‌చేసి నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపుచేశారు. అక్కడికి వచ్చిన డీఈఈ శ్రీనివాస్‌ను బాధితుడు శ్రీకాంత్ కుటుంబసభ్యులు నిలదీయడంతో ఆయన పైఅధికారులకు ఫోన్‌చేసి పరిస్థితిని వివరించారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

వినాయక మండప ఏర్పాట్లలో అపశృతి

చేర్యాల, ఆగస్టు 26 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకుని చేర్యాల పట్టణంలోని పలు వీధుల్లో నిర్వాహకులు మండపాలను ఏర్పాటు చేస్తున్న క్రమంలో మంగళవారం అపశృతి చోటు చేసుకున్నది మండపం పైభాగాన కర్రను కట్టర్‌తో కట్‌చేస్తుండగా ఓ యువకుడి చేతికి గాయమవడంతో 30కుట్లుపడ్డాయి. అలాగే మరో యువకుడి కాలికి గాయమైంది.

లంబోధర హో

(5వ పేజీ తరువాయి)

ఉన్న చిన్న విగ్రహం ధర ఇప్పుడు రూ.750 నుంచి రూ. రూ.800 వరకు పలుకుతోంది. గతంలో రూ. 3వేలకు అమ్ముడైన విగ్రహం ఇప్పుడు రూ. 7వేల నుంచి రూ.8వేలకు విక్రయిస్తున్నారు. పీవోపీ, మట్టి విగ్రహాల మధ్య తేడా లేకుండా ధరలు పెరిగాయి. పండుగ చేసుకోవడం తప్పనిసరి, కానీ ధరలు చూస్తే జేబులకు చిల్లు పడే దుస్థితి నెలకొనడంతో సామాన్యుడు ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నాడు.

ధరలు పెరగడానికి కారణాలివే..

సాధారణంగా గణేశ్ విగ్రహాలు పూణే, నాందేడ్, షోలాపూర్ వంటి ప్రాంతాల నుంచి దిగుమతి అవుతాయి. అయితే, ఈసారి ఆ ప్రాంతాల్లో విగ్రహాల తయారీ తగ్గడంతో ధరలు పెరిగాయి. అంతేకాకుండా, రవాణా ఖర్చులు కూడా భారీగా పెరిగాయి. గతంలో రవాణాకు రూ.23వేలు ఖర్చు కాగా, ఈ ఏడాది రూ. 36 వేలు అవుతోందని విగ్రహాల వ్యాపారులు చెబుతున్నారు. విగ్రహాలు విక్రయించడానికి మనుషులకు రోజుకు రూ. 500నుంచి రూ. 800 వరకు చెల్లించాల్సి వస్తోందని, ఈ ఖర్చులన్నీ కలిపి విగ్రహాల ధరలను పెంచుతున్నామని వ్యాపారులు చెబుతున్నారు.

పూజా సామగ్రి, నిత్యావసర వస్తువులు కూడా..

గణేశ్ ప్రతిమలే కాదు.. పూజా సామగ్రి ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. సాధారణ రోజుల్లో ఒక ధరకు, పండుగ సమయంలో ఎంఆర్‌పీ ధరలకు అమ్ముతున్నారు. అగరుబత్తులు, పసుపు, కుంకుమ, హారతి కర్పూరం, గంధం, ఒత్తులు, నూనె వంటి పూజా సామగ్రి సాధారణ రోజుల్లో ఎంఆర్‌పి కంటే 20 నుంచి 25 శాతం తక్కువకే లభిస్తాయి. కానీ పండుగ సమయంలో మాత్రం పూర్తి ధరలకు అమ్ముతున్నారు. పూలు, పండ్లు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు కూడా భారీగా పెరిగాయి. గత నెల శ్రావణ మాసం, ఇప్పుడు వినాయక నవరాత్రుల కారణంగా ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. కొన్ని రోజులుగా కొబ్బరికాయల ధరలు కూడా భారీగా పెరిగాయి. దిగుమతి తగ్గడమే ధరలు పెరగడానికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు.